సుధాకరం తన వేలుమీద ఉంగరంకేసి చూసుకున్నాడు. వెంటనే అతనికి సుజాత జ్ఞాపకం వచ్చింది.

ఆ ఉంగరం పైకితీసి లోపల చెక్కిన 'సు' అన్న పొడి అక్షరం కేసి చూసుకున్నాడు. మదరాసులో సుజాత కుటుంబం, సుధాకరం కుటుంబం రాయపేటలో కొంచెం సమీపంలో నివసించేవారు.

# నీమీద ఒట్టే

పి. గణపతిశాస్త్రి




సుజాత బాగా ఆస్తిపాస్తులున్న వారి అమ్మాయి. సుధాకరానిది చాలా సామాన్యమైన కుటుంబం. కాలేజీలో చదువుకునే రోజుల్లోనే సుధాకరానికి, సుజాతకి కొంత సన్నిహితమైన పరిచయం ఏర్పడిందని అంటారు. ఆ పరిచయమే క్రమక్రమంగా కొంత గాఢమైన ప్రేమగా మారింది. ఆ ప్రేమ ఫలించే మార్గం సుధాకరాని కెక్కడ కనుచూపుమేరలో కనిపించలేదు.

సుజాత నెవరికైన ఆస్తిపాస్తులున్న వరుడికిచ్చి వివాహం చేయాలని ఆమె తండ్రి కలలుకంటూ ఉండేవాడు. ఆమె శరీరచ్ఛాయ మొత్తం మీద చామన చాయ క్రిందేలెక్క. అయినా సుజాత అందగత్తెల కోవలోనే చేరుతుంది. ఆమె కళ్ళుచాలా విశాలమైనవి. చిరునవ్వులో ఒక విచిత్రమైన ఆకర్షణ స్ఫురిస్తుంది.

నిజానికి సుధాకరంలో అంతగా చెప్పుకోదగిన అందమేదీలేదు. అతగాడు చాలా సామాన్యంగా, కొంత అనాకారిగా కూడా కన్పిస్తాడు. చదువు సంధ్యలలోకూడా సుధాకరం అంతగా రాణించలేదు. ఐదారు డింకీలుకొట్టి మొత్తంమీద బి.ఏ. అనిపించుకున్నాడు.

అయితే అతడు చక్కని గొంతుతో సినిమా పాటలు శ్రోతల నందరినీ సమ్మోహపరిచే తీరులో పాడగలడు. సుజాత కటువంటి శక్తిలేదు. అంతేకాదు ఆమెకి ఏ కళమీద ఏమాత్రం అభిరుచి లేదు. ఐతే ఆమె చాలా తెలివైనది. ప్రతి తరగతిలోను ఫస్టు మార్కులు తెచ్చుకుంటూ బి.ఏ ఫస్టు క్లాసులో పాస్ అయింది. ఆమె చిరునవ్వు చాలా సొగసైనదని, చామనచాయ ముఖాని కెంతో కళ తెచ్చిందని నలుగురు అనుకోపడం కద్దు.

మొట్టమొదట తన పెళ్ళి ప్రస్తావన వచ్చినపుడు సుజాత సుధాకరాన్ని తప్ప వేరొకరెవరిని వివాహమాడదలుచుకోలేదని తల్లిదగ్గిర భీష్మించుకుని కూర్చుంది. ఆమె ఆ మాట వింటూనే నిలువునా దిగాలు పడింది.

“ఆదేమిటే పిచ్చిదానా!”

“ఆ దరిద్రగొట్టు కోతి మీద నీకంతటి ప్రేమేమిటే?”

“నీకేమైనా మతికాని పోలేదుకదా!”

లక్షణంగా ఆస్తిపాస్తులున్నవాడిని, చదువుసంధ్యలున్న వాడిని వెదికి పట్టుకుని వివాహం చేయాలని మీ నాన్న శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు.

"ఏదో పిచ్చిపిచ్చి పాటలేవో నాలుగు పాడగానే సరా "

"వాడు నీకు చక్కని చీరైనా కొనిపెట్ట గలడా!"

"తప్పమ్మా! మీ నాన్న కిది తెలిస్తే నీమీద కారాలు, మిరియాలు నూరుతారు. నా మాటవిని ఆ సంగతి మరి నా దగ్గర ప్రస్తావించవద్దు" అని అంటూ గట్టిగా చీవాట్లు పెట్టింది.

సుజాత కళ్ళ నీళ్ళుపెట్టుకుని తల వంచుకుని కూర్చుంది. తల్లి వద్దన్నకొద్దీ సుజాత సుధాకరం మీద మరింతగా ప్రేమ పెంచుకోసాగింది.

సుజాత తండ్రి మాధవరావు బాగా పేరు మోసిన లాయరు. అతనికి సుజాత ఏకైక పుత్రిక. మరి వేరే సంతానం లేదు. రెండు చేతులా డబ్బు గడించాడు. తమ హోదా కంటే పెద్ద హోదాలో ఉన్న వరుడికెవరికైనా యిచ్చి సుజాత వివాహం జరిపించాలని మరింతగా భీష్మించుకుని కూర్చున్నాడు.

ఆపైన సుజాత తాను పట్టిన పట్టు విడిచిపెట్టడం లేదని భార్యవల్ల విని మరింతగా మండిపడ్డాడు. "పోనీ ఆ దరిద్రగొట్టు కోతినే పెళ్ళాడని !"

"పెళ్ళంటూ చేసుకుంటే ఇంత వాడుగాని, ఇదిగాని నా ఇంట్లో అడుగుపెట్టడానికి వీల్లేదు. ఇవాళతో దానితో పూర్తిగా తెగతెంపులు చేసుకుంటా"నని బెదిరించాడు. అయితే సుజాత తల్లి నెమ్మదిగా అతనికి నచ్చచెప్పింది.

"అదేవిటండి ? అలాగంటారు ? నేను నా బంగారు తల్లిని నా యింట్లో అడుగుపెట్ట నివ్వకుండా గెంటివేయగలనా ? ఏదో పసిపిల్ల. తొత్తిగా చిన్నతనం. అందుచేత అది అలాగ మంకుపట్టు పట్టుకుని కూర్చుంటుంది. లక్షణంగా యింకొక మంచి సంబంధం చేస్తే కొన్నాళ్ళకీ వ్యవహారం అంతా పూర్తిగా మరచిపోతుంది. కాస్త తొందరగా మంచి సంబంధ మేదైనా చూడండి. ఇది మరీ ముదిరితే నానా గొడవ అవుతుంది. కాస్త నామాట వినండి. తొందర పడకండి" అని నచ్చచెప్పింది.

ఆపైన సుజాత తల్లిదండ్రులిద్దరు ఆమె మీద గట్టి నిఘా వేశారు. ఆమె ఎక్కడికి వెళ్ళింది, ఎవరెవరికి ఉత్తరాలు రాస్తున్నది ఒకకంట కనిపెట్టసాగారు. అయితే సుజాత, సుధాకరాలిద్దరు వారి నిఘా తప్పించుకుని బాగా మెలకువగా వ్యవహరించసాగారు. సుధాకరం ఎవరో ఒక అమ్మాయి పేరుతోనే ఉత్తరాలు రాస్తూ ఉండేవాడు. అందుచేత సుజాత తల్లిదండ్రులకు ఆమె ప్రవర్తనలో లోపాలేవీ కనిపించలేదు.

తరచుగా సుజాత, సుధాకరాలిద్దరు మదరాసులో ఒక లంచ్ హోమ్‌లో ప్రత్యేకమైన స్పెషల్ రూమ్‌లో కలుసుకుంటూ తమ కష్టసుఖాలేవో ముచ్చటించుకుంటూ వుండేవారు. ఆ సమయంలో సుజాత ఒకనాడు సుధాకరం ముందు కూర్చుని కంట నీరు పెట్టుకుని వలవలా విలపించసాగింది. అది గమనించి సుధాకరం ఆమెను ఓదార్చి.

"ఎందుకు సుజా! అలాగ ఏడుస్తున్నావు" అని ప్రశ్నించాడు.

సుజాత అతికష్టం మీద తన ఏడుపు దిగమింగుకో గల్గింది.

"ఏమి చెప్పను ? నా పెళ్ళి సంబంధం త్వరలోనే స్థిరపరిచేటట్లున్నారు."

"ఎవరితో."

"ఏమో నేనిప్పుడు చెప్పలేను."

"వరుడు.బాగుంటాడా?"

"పెళ్ళి చూపులు అయినాయా ?"

"ఇంకా కాలేదు."

"పోనీలే మనం ఏం చేస్తాం" సుధాకరం కంఠం గద్గదమైనది.

అంతకు మునుపే వారిద్దరు తమ వుంగరాలు మార్చుకోవాలని నిశ్చయించుకున్నారు. కాని సుధాకరానికి వేలికి అసలు ఉంగరమే లేదు. అందుచేత సుజాతే రెండు ఉంగరాలు కొని వాటిలోపల 'సు' అని అక్షరాలు చెక్కించింది. ఆపైన ఒకనాడు ఒక ఉంగరం సుధాకరం అనామికాంగుళికి అలంకరించి అతని చేత తన వేలుకి అటువంటి ఉంగరమే అలంకరింపచేయించింది.

ఆ తరువాత మరి ఆమె నోట మాట పెగల్లేదు. అదేపనిగా కుమిలి కుమిలి విలపించసాగింది. అతనికేసి జాలిగా చూస్తూ "మనం ఇంక మళ్ళీ కలుసుకుంటామో కలుసుకోమో! కాస్త ఈ ఉంగరం నీ వేలుకి పెటుకుని నన్ను ఎల్లప్పుడు గుర్తుంచుకో. ప్రతి పౌర్ణమినాడు రాత్రి పది, పదకొండు గంటలమధ్య నన్ను ఒక్కసారి స్మరించుకో. నేను కూడా అదే సమయంలో నిన్ను గుర్తుంచుకుని నిన్ను తలుచుకుంటూ ఉంటాను" అంటూ అతనిఒడిలో వాలి అదే పనిగా విలపించసాగింది. సుధాకరం ఆమె తల నిమురుతూ ఎంతో ఆప్యాయంగా ఓదార్చాడు.


* * *

మరికొన్ని వారాలలోనే సుజాత, శ్రీనివాసుల కిద్దరికి యథావిధిగా గొప్ప వైభవంగా వివాహం జరిగిపోయింది. శ్రీనివాసు గొప్ప వ్యాపారస్తుడు. అతనికి ఒక చిన్న మేడ. దానికి తగిన కారు మొదలైన హంగామాలన్నీ వున్నాయి. అంతేకాదు అతడు చాలా పెద్ద పెద్ద కంపెనీలలో డైరెక్టరు. మంచి వ్యాపారదక్షత కలవాడు.

నిజం చెప్పవలసివస్తే తెల్లని శరీరచ్ఛాయలో అతడు మంచి రూపసిగానే కన్పిస్తాడు. వివాహానికి వచ్చిన అతిథులందరు వధూవరుల ఈడూ, జోడు మొదలైనవన్నీ చూసి "అవునవునని" తలలూగించారు. సుజాత అందగత్తెఅని విని శ్రీనివాసు స్వయంగా వరించి వివాహం చేసుకున్నాడు.

"వరుడు నీకు నచ్చాడా ?" అని తల్లి సుజాతనడిగినప్పుడు మరి గత్యంతరం యేమీలేక నచ్చాడన్నట్టే తల ఊగించింది. కాని వివాహంనాడే ఒక గదిలో కూర్చుని ముక్కుతూ, మూల్గుతూ కంటనీరు పెట్టుకోసాగింది.

"అదేమిటే అలాగ ఎందుకు ఏడుస్తావు. నీకేమైన తలనొప్పా" అని తల్లి అడిగింది.



"నాకు ఒంట్లో బొత్తిగా బాగోలేదూ" అంటూ సుజాత బాగా దిగాలుపడింది.

మాధవరావు ఆ సంబంధం స్థిరపరచ డానికి అనేక కారణాలు కలిసివచ్చాయి. అసలు మొదటికారణం శ్రీనివాసు చాలా ఆస్తిపరుడు. ఆపైన మదరాసులోనే మాధవ రావుగారున్న యింటికి సమీపంలో వున్న జార్జ్‌టవునులో స్వంత భవంతిలో నివసిస్తు న్నాడు. అందువల్ల వొక్కగా నొక్క కుమార్తె సుజాత తమ కెంతగానో దగ్గిర గానే వున్నదన్న సంతృప్తికూడా కలిగింది.

వివాహానికి ముందు కొంత దుఃఖించినా, కుమార్తె క్రమక్రమంగా కుదుటపడి అందరి లాగే పిల్లలతోను, పాపలతోను హాయిగా సుఖపడగలదని తల్లి ఆశించింది. సుజాత కూడా అందరిమధ్య హాయిగా వున్నట్టుగానే కన్పడింది.

అలాగ మరికొంతకాలం జరిగిం తరు వాత సుజాతకు ఒక మగపిల్లవాడు, ఆడపిల్ల కూడా కలిగారు. అయితే సుజాత ఆనందా నికి అనేక విఘాతాలు ఏర్పడ్డాయి. శ్రీనివాసు ఐశ్వర్యవంతుడుకదా! అందుచేత సామా న్యంగా సిరిసంపదలున్న వారిలో కొంత మందికి ఏర్పడే దుర్వ్యసనాలు కొన్ని అత నికి కూడా అలవడాయి.

బాగా ఆస్తిపాస్తులు, హోదా మొదలైన వన్నీ పెరిగినకొద్దీ అతనికి తాగుడు అల వాటయింది. దానితోపాటు సమాజంలో నలు గురితోను విచ్చలవిడిగా సంచరించడం ప్రారంభించాడు.


అతనికి తన కంపెనీలో పనిచేస్తున్న ఇద్దరు ముగ్గురు యువతులతో కూడా బాగా దోస్తీ కలిసిందని సుజాత ఇట్టే పసిగట్టి వేసింది. నిజానికి సుజాత ఎన్నదగిన అంద గత్తెలలోనే లెక్క. కాని అందమైన భార్యల చక్కదనం భర్తలకన్నా పైవారే గుర్తించి ఎక్కువగా మెచ్చుకుంటారు.

మొట్టమొదట శ్రీనివాస్ సుజాత మీద కొంత అభిమానం, ఆదరం, ప్రేమ పెంచు కున్నా క్రమక్రమంగా అవి పూర్తిగా సడలిపోయాయి. ఆమె ఎప్పుడైనా మాట్లా డితే అదేపనిగా ఆవలిస్తూ కూర్చునేవాడు. సుజాత కాపరిస్థితిలో శ్రీనివాస్ మీద జీవితం మీద కూడా విరక్తి ప్రారంభమయింది. ఆమెకు అన్నీ వున్నా ఏమీ లేనట్లుగానే జీవితం అంతా శూన్యంగా స్ఫురించ సాగింది.

శ్రీనివాస్ ఉద్దేశ్యమేమోకాని విందుల లోను, వినోదాలలోను తన స్నేహితు లందరితోను సుజాత బాగా కలుపుగోలు తనంగా ఉండాలని, అలాగ ఉండకపోతే అది మర్యాద కాదని ప్రోత్సహించ ప్రారంభించాడు. సుజాత కది బొత్తిగా రుచించలేదు. అయినా భర్త అలాగ ప్రోత్సహించిన తరువాత తాను ముభావం వహించడం మంచిది కాదని కొందరు శ్రీని వాసు స్నేహితులతో కులాసాగా మాట్లా డుతూ నవ్వుతూ పేలుతూ తిరగసాగింది.

సుజాతలో కల్గిన ఆ పరిణామానికి శ్రీని వాసు మొట్టమొదట కొంత సంతోషించినా క్రమక్రమంగా అతనికి భార్య నడవడి మీద, వేళాకోళాలమీద, మాటల నేర్పరి తనంమీద అసూయ, అనుమానం ప్రారంభ మయ్యాయి.

సుజాత అది పసిగట్టి "మీ మగవాళ్ళతో అన్నీ సమస్యలే! ముభావంగా ఉంటే బెల్లం కొట్టిన రాయిలా ఉన్నావంటారు. నలుగురి తోను, నవ్వుతూ పేలుతూ కాలక్షేపంచేస్తే లోలోపల లేనిపోని అనుమానాలేవో పెంచు కుంటారు" అని కించపడసాగింది.




ఆపైన ఆమె ఒకనాడు శ్రీనివాస్‌తో "నా మీద అనవసరంగా అనుమానపడకండి. నేసలాంటిదాన్ని కాను. అదీగాక నాకెవరి మీదైనా మక్కువకలిగితే మీరాపగలరా! మీ యిష్టంవచ్చినట్లు మీరుంటే నేనేమయినా అడ్డుకొని ఆపగలిగానా?" అంటూ రుసరుస లారంభించింది.

క్రమక్రమంగా భార్యాభర్తల మధ్య ఎడముఖాలు, పెడముఖాలు ఎక్కు వయ్యాయి. శ్రీనివాసు అర్ధరాత్రిదాకా తాగుడుతోను, పేకాటలతోను క్లబ్బులలోనే గడిపివేసేవాడు. ఒక్కొక్కప్పుడు ఇంటికి తిరిగి రావడంకూడా కరువయ్యాయి. క్రమంగా భార్యా భర్తలమధ్య పోట్లాటలు ఎక్కువయ్యాయి.

సుజాత ఏమాత్రం జంకులేకుండా శ్రీనివాసు మాటలన్నింటికి మరింత ఉక్రో షంతో ప్రతి సమాధానాలు ఇవ్వసాగింది. సుజాత తల్లికి ఈ పరిస్థితి అంతా బోధపడక పోలేదు. కాని ఆమె 'మగవాళ్ళ తీరే అంతమ్మా, అనవసరంగా నోరు పారేసుకుని నీవతనితో పోట్లాడి సంసారం రొష్టు చేసుకోవద్దమ్మా" అని బతిమాలసాగింది.

ఒక్కొక్కప్పుడు ఈటె పోటులవంటి సుజాతమాటలు సహించలేక శ్రీనివాసు చంప ఛెళ్ళుమనిపించేవాడు. ఆ పరిస్థితిలో పసిపిల్లలిద్దరు బెంబేలుపడి రాగా లారం భించేవారు. శ్రీనివాసు కిక ఇంట్లో వుండ డమే ఒక ప్రత్యక్ష నరకంగా స్ఫురించ సాగింది. సుజాతకి ఆ గృహస్థ జీవితం బాగా భయంకరంగా పరిణమించసాగింది.

* * *

ఒక్కొక్కరి అనురాగాలు, ఆపేక్షలు, దుఃఖాలు, అభిమానాలు అట్టే నిలవవు. అవి పుబ్బలో పుట్టి మఖలో మాడిపోతూ వుంటాయి. కాని కొంతమంది అనురాగా లటువంటివి కావు. యావజ్జీవం వారిని వేధి స్తూనే వుంటాయి. సుధాకరం ప్రేమ అటు వంటిది. అతడు శ్రీనివాసు గృహానికి చాలా దూరంలో మదరాసులోనే వున్న త్యాగరాజ నగర్‌లో నివసిస్తున్నాడు.

ఇప్పుడతడు వివాహం చేసుకున్నాడు. ఒక ప్రయివేటు కంపెనీలో చాలీచాలని 400 రూపాయల జీతంతో అతి కష్టంమీద జీవితం నెట్టుకువస్తున్నాడు. సంసారం చాలా సామాన్యంగా, నిరుత్సాహంగా, నీర సంగా సాగిపోతోంది. అయితే తన వేలు మీది ఉంగరంకేసి చూసుకున్నప్పుడు అత నికి పట్టరాని ఆనందం, ఉల్లాసం కలుగుతూ వుంటాయి.

సుజాత నెలాగయినా ఒక్కమారైనా,

కలుసుకోవాలని అతడెంతో ఉబలాటపడ్డాడు. అందుకని ఆమెను గురించి వాకబు లెన్నో చేశాడు. తెలిసిన సంగతులుబట్టి ఆమె బొత్తిగా సుఖపడటంలేదని ఆకళించు కున్నాడు. ఆ వార్త అతని గుండెలో శూలంలా నాటుకుంది.

"అయ్యో! సుజాత నన్నివిధాలా సుఖ పెట్టాలని మాధవరావుగారు తమ యావ చ్ఛక్తి వినియోగించి ప్రయత్నించారు. అయినా ఆమె జీవితం యిలాగ బాధాకరంగా మారిపోవడానికి ఏమిటి కారణం? ఆమె సుఖపడటానికి అన్నీ అమరి వున్నాయే? దైవం ఒక్కొక్కప్పుడు మానవుని సుఖాలు చూసి ఓర్వలేక కళ్ళల్లో నిప్పులు పోసుకుంటాడులా వుంది. లేకపోతే సుజాత బ్రతుకు యిలాగ యెందుకు మారాలి?

అలాగ మధనపడుతున్న కొద్దీ అతనిలో ఆమె నెలాగయినా వొక్కసారి కలుసుకుని తీరాలన్న తహ తహ యినుమడించింది. పాపం సుజాత! నామీద యెంతటిగొప్ప ఆత్మీయత పెంచు కున్నది! నాలో అందమా, చందమా ఆస్తులా, పాస్తులా ఏమున్నాయి? పిచ్చి పిచ్చి సినిమాపాటలు విని ప్రేమ పెంచు కునే వారెవరైన వుంటారా? ఏమిటో? అన్నీ విడ్డూరాలే!!

ఆపైన ఒకనాడతడు సుజాత నెలా గయినా, దూరం నుంచైనా చూడాలన్న తహతహతో ఆమె యింటికేసి బయలుదేరి వెళ్ళాడు. అప్పటికి రాత్రి సుమారు 9 గంటలు కావచ్చింది. సుజాత యింటి ముందు నిలిచి పరిశీలించి చూశాడు. కాని ఆమె ఎక్కడా కనబడలేదు. మళ్ళీ మళ్ళీ పరిశీలించి చూశాడు.

అతనికి లోపలనుంచి సుజాత, శ్రీని వాసుల మధ్య చెలరేగిన వాదోపవాదాలు, మధ్య మధ్య శ్రీనివాసు చెంపపెట్టులు కూడా వినిపించసాగాయి. ఆ దెబ్బలన్నీ తనకే తగులుతున్నట్లు సుధాకరం బాధ పడ సాగాడు. మరి వుండబట్టలేక సుధాకరం శ్రీనివాసు వీధి తలుపుతట్టాడు. తలుపుమూసి గడియపెట్టక పోవడంవల్ల అది తటాలున తెరుచుకుంది.

సుధాకరం లోపల అడుగుపెట్టాడు. ఎదు రుగా వలవలా విలపిస్తున్న సుజాత కనిపిం చింది. శ్రీనివాసు అంతలోనే సుజాత జుట్టు పట్టుకుని లాగి గట్టిగా ఒక చెంపపెట్టు పెట్టాడు. సుధాకరం శ్రీనివాసుకెదురుగా వెళ్ళి పెద్దగా హెచ్చరించాడు.

"ఎందుకయ్యా! అలాగ గొడ్డును బాది నట్లు బాదుతావు? నీకేమయినా పిచ్చిగాని పట్టలేదుకదా! చాలు చాల్లేవయ్యా!"




అది విని శ్రీనివాసు భగ్గుమని మండి పడ్డాడు.

"ఎవడ్రా నువ్వు?"

"మా ఇంటిలో ఎందుకు అడుగు పెట్టావు? మేం దెబ్బలాడుకుంటే మధ్య నీకెందుకురా? నడు నడు. నోరు మూసుకుని నడు. లేకపోతే మెడ పట్టుకుని గెంటెయ్య గలను."

"నీవలాగ సుజాతని కొట్టడానికి వీల్లేదు. కొట్టావంటే మాట దక్కదు" సుధాకరం పట్టరాని ఆవేశంతో ఊగిపోయాడు.

"మధ్యన నువ్వెవడివిరా రాస్కెల్. నా పెళ్ళాన్ని కొడతాను, తిడతాను, లేకపోతే పీక నులిమి చంపేస్తాను."

"నువ్వలాగ చంపడానికి వీల్లేదు. దానికి లోకంగాని, ప్రభుత్వంగాని హర్షించదు. మళ్ళీ సుజాత వీపుమీద దెబ్బపడిందంటే నేనే నిన్ను వీధిలోకి గెంటేస్తాను జాగ్రత్త!"

ఆపైన సుధాకరం, శ్రీనివాసు వొకరొక రితో తలపడ్డారు. నిజానికి సుధాకరంకన్నా శ్రీనివాసు రవ్వంత బలవంతుడే కాని చిత్తుగాతాగి మత్తెక్కి వున్నందువల్ల సుధా కరం బలమైన తోపుతో ధబాలున వెనక్కి కూలబడ్డాడు. అంతలోనే వొళ్ళు దులుపు కుంటూ లేచి "చూడు నిన్నేం చేయిస్తానో పోలీసు లాకప్‌లో పెట్టిస్తాను" అని రొజు కుంటూ ఆ చీకటిలో వీధిలోపడి అదృశ్య డయినాడు.

అంతకు మునుపే ఆ క్రొత్త వ్యక్తి సుధాకరమే అని సుజాత గ్రహించింది. కాని తాను చెయ్యగలిగింది ఏమీలేక ఒక మూల కూలబడిపోయింది. వెంటనే—

"సుధా! నీవెలాగ వచ్చావిక్కడికి?" అని ఎంతో ఆత్రంగా ప్రశ్నించింది. సుధా కరం తన సంగతి అంతా ఏకరువుపెట్టాడు.

అంతలోనే సుజాత అందుకుంది.

"ఆయన మరి రారు! తన ఆఫీసులో పనిచేస్తున్న లేడీక్లర్కు ఇంటికి వెళ్ళి ఈ రాత్రి అంతా అక్కడే గడిపేస్తారు!" అది విని సుధాకరం నిలువునా నిర్ఘాంతపడ్డాడు.

అంతలోనే సుజాత అందుకుంది, "నాకీ వ్యవహారాలంతా దినదినగండమే. చిత్తుగా తాగి వచ్చి ఏదో తగాదా పెట్టుకుని నన్నిలాగ తిడుతూ, కొడుతూ వుంటారు. చాలా కాలం నుంచి నిన్నొక్కసారి చూచి ప్రాణాలు విడుద్దామని అనుకున్నాను. మరి నేనింక జీవించను. ఏ నిద్రమాత్రలో మింగి చని పోతాను." అంటూ కంటనీరు పెట్టుకుంది.

అంతలోనే సుధాకరం అందుకున్నాడు:

"నీవలాగ అనవద్దు సుజా!" బంగారపు బొమ్మలలాంటి పసపిల్లలు ఇద్దరున్నారు కదా! వాళ్ళకోసమైన జీవించి తీరాలి. క్రమ క్రమంగా పరిస్థితులు అవే బాగుపడతాయిలే. చచ్చి ఏం సాధిస్తావు, నీవలాగ మాట్లాడితే నా గుండెలో బల్లెం పొడుచుకున్నట్టు వుంటుంది. నా మాట విను.

నీకు నేనిచ్చిన ఉంగరం సాక్షిగా పిల్లల మీద నామీద ఒట్టు పెట్టుకుని చచ్చిపోనని ప్రమాణం చేస్తే తప్ప నేనిక్కడ నుంచి కదలను. కాస్త నా మాట విను. అప్పు డప్పుడు మీ పనిమనిషి ద్వారా నీ క్షేమ సమాచారాలు తెలియజేస్తూ ఉండు. నాకదే పదివేలు." అంటూ బ్రతిమాలుకున్నాడు.

అయినా సుజాత మారు పలకలేదు. నిశ్చ లంగా అతనికేసి చూస్తూ కూర్చుంది. అంత లోనే సుధాకరం ఆమె రెండుచేతులు పట్టు కుని గాఢంగా గుండె కదుముకొని మాటి మాటికి బ్రతిమాలుకున్నాడు. మరి కొంత సేపటికి సుజాత పెదవిమీద రవ్వంత చిరు నవ్వు మొలకెత్తింది.

"సుధా! నీకంటే నాకీ లోకంలో ఆత్మీయు లెవరూ లేరు. నిన్నే తలుచుకుని జీవిస్తున్నాను నేను. నీ వన్నట్టు పసిపిల్లలకోసం, నీకోసం జీవిస్తాను."

"నిజంగానేనా? నా మీద వొట్టేనా?" అని అడిగాడు సుధాకరం.

"నిజమే. ముమ్మాటికీ నిజమే. నీ మీద వొట్టే. నీ విచ్చిన ఉంగరం సాక్షిగా నిజమే" అంటూ సుజాత చిరునవ్వుతో అతనిని సాగనంపింది.

సుధాకరం వెంటనే వీధిలో చీకటిలోపడి అదృశ్యుడయినాడు.